సాక్షి
పెద్దపల్లి
గురువారం । 2 । నవంబర్ । 2023

జీవితంలో అబద్ధాలు చెప్పవద్దు

జ్యోతినగర్(రామగుండం): పిల్లలూ.. ఎవరు ఎన్ని చెప్పినా, ఎంత ఒత్తిడి చేసినా జీవితంలో అబద్ధాలు చెప్పవద్దని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ విద్యార్థులకు సూచించారు. బుధవారం ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి విచ్చేసిన క్రమంలో జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు పరిశీలించారు. ఉన్నతి కార్యక్రమాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని, ప్రతీ విద్యార్థి విద్యా ప్రమాణాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు.



న్యూస్‌రీల్

వివరణ తీసుకున్నాకే వార్త ప్రచురించాలి



మాట్లాడుతున్న సీపీ రెమా రాజేశ్వరి

గోదావరిఖని: సమస్యలపై వార్త ప్రచురించే ముందు సంబంధిత అధికారి వివరణ తీసుకుని, ప్రజలకు వాస్తవ సమాచారం అందించాలని రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి కోరారు. సీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా వర్క్‌షాప్‌లో మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియలోని ప్రతీ అంశాన్ని ఎన్నికల సంఘం సునిశితంగా పరిశీలిస్తోందన్నారు. కమ్యూనికేషన్, క్లారిఫికేషన్, కో ఆర్డినేషన్ అనే త్రీసీ విధానం పాటించాలన్నారు. సోషల్ మీడియాతో ఇబ్బందులపై బాధితులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు. కమిషనరేట్ పరిధిలో 9 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని, ఇందులో ఐదు పూర్తిగా, నాలుగింటిలో కొన్నిగ్రామాలు ఇతర ప్రాంతాల పరిధిలో ఉన్నాయని తెలిపారు. కమిషనరేట్ పరిధిలో 1,564 పోలింగ్ కేంద్రాలు ఉండగా, వీటిలో 237 సమస్యాత్మకత, 50మావోయిస్టు ప్రభావిత, 708 సాధారణవి ఉన్నాయని వివరించారు. 28 ఫ్లయింగ్ సర్వేలెయిన్స్, 28 స్టాటిటిక్స్ సర్వేలెయిన్స్ టీంలను నియమించామన్నారు. ఐదు కంపెనీల కేంద్ర, రెండోదశలో 11కంపెనీల పారామిలటరీ బలగాలను వినియోగించాలని యోచిస్తున్నామన్నారు. ప్రచారం కోసం సువిధ యాప్ ద్వారా 402 దరఖాస్తులు అందాయని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యాక భారీగా నగదు, విలువైన వస్తువులు సీజ్ చేశామని తెలిపారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం



మాట్లాడుతున్న ఎంఎస్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని/జ్యోతినగర్: కాంగ్రెస్ పాలనతోనే పేదలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ అభ్యర్థి ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. బుధవారం 46, 3వ డివిజన్ అన్నపూర్ణకాలనీలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే చందర్ ఈప్రాంత అభివృద్ధిని మరచి, అధికార దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. ఓసీపీ తీసుకొచ్చి బొందల గడ్డగా మార్చారని దుయ్యబట్టారు. రిటైర్డ్ సింగరేణి కార్మికులకు ఉచిత జిమ్ సౌకర్యం కల్పిస్తామన్నారు. తనకు ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. ఈసందర్భంగా100మంది కాంగ్రెస్‌లో చేరారు. అన్నపూర్ణ కాలనీలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఈదునూరి మల్లేశ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో పార్టీలో చేరారు.



ప్రజలే వేర్లు.. ప్రభుత్వమే ఫలం. వేర్లు సరిగా పనిని నిర్వర్తిస్తేనే ఫలం తియ్యగా ఉంటుంది.
– మహాత్మాగాంధీ

మీకు తెలుసా..?

గద్దెల్లేవ్.. జెండాలు ఎగురవ్

జూలపల్లి(పెద్దపల్లి): హుస్సేన్‌మియావాగు నీటి గలగలలు.. ఎటుచూసినా పచ్చని పంట పొలాలు.. ప్రపంచ ప్రసిద్ధి చెందిన బౌద్ధ స్తూపం ఉన్న ఊరు.. పురావస్తు శాఖలో నమోదైన మారుమూల పల్లె.. అదే పెద్దపల్లి జిల్లాలోని వద్యాపూర్ గ్రామం. 2000 సంవత్సరం వరకు నక్సల్స్ ఆధిపత్యంలో ఉండేది. అయినా, 1999లో అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు జన్మభూమి కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆ గ్రామానికి చేరుకున్నారు. బురద రోడ్లు చూశారు. అన్ని వీధుల్లోనూ సీసీ రోడ్లు, లక్షల లీటర్ల సామర్థ్యంతో వాటర్ ట్యాంక్ నిర్మించారు. అంతేకాదు.. పోలీసు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన ఇదే గ్రామస్తుడు వద్యాపూర్ చంద్రమౌళి తను చదువుకుని, నిర్మించిన వేదికపైనే చంద్రబాబు గ్రామసభ నిర్వహించారు. ఇక్కడి మరో నక్సల్ నేత పుల్లూరి ప్రసాదరావు ఇప్పటికీ అజ్ఞాతంలోనే ఉన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఉన్నా.. ఆ పార్టీల గద్దెలు నిర్మించలేదు. పార్టీల జెండాలు ఎగురనూ లేవు.



వద్యాపూర్ గ్రామం

మహామహుల మంత్రపురి

- సీఎం నుంచి పీఎం దాకా ఎదిగిన పీవీ
- ఉమ్మడి ఏపీ శాసన సభాపతిగా శ్రీపాద
- రాష్ట్రమంత్రిగా సేవలు అందించిన శ్రీధర్‌బాబు
- పునర్విభజనలో ముక్కలైన మంథని
- పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి పరిధిలోకి..

మంథని: మంథని అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పడ్డాక 15సార్లు ఎన్నికలు జరిగాయి. ఏడు మండలాలతో కూడిన మంథనికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే ప్రత్యేకత ఉండేది. జిల్లాల పునర్విభజనతో నియోజకవర్గం రెండు జిల్లాల పరిధిలోకి వెళ్లింది. మంథని, కమాన్‌పూర్, ముత్తారం, రామగిరి(కొత్త మండలం), పాలకుర్తి(కొత్త మండలం) పెద్దపల్లి జిల్లాలోకి, కాటారం, మహదేవపూర్, మహాముత్తారం, మల్హర్, పలిమెల(కొత్త మండలం) జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోకి వెళ్లాయి. 2018లో తొలిసారి రెండుజిల్లాల పరిధిలోని ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారు.




ఓటర్లది విలక్షణమైన తీర్పు..

- ఇక్కడి ఓటర్లకు విలక్షణమైన తీర్పు ఇచ్చే ఆనవాయితీ ఆదినుంచీ కొనసాగుతోంది.
- 15సార్లు జరిగిన ఎన్నికల్లో 11సార్లు కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు.
- అంతేకాదు.. ఒక్కసారే బీసీ నేతను ఎమ్మెల్యేగా గెలిపించారు.
- రెండుసార్లు రెడ్డి, మిగతా 12సార్లు బ్రాహ్మణులను పాలకులుగా ఎన్నుకున్న చరిత్ర ఇక్కడి ఓటర్లకు ఉంది.
- 1952లో సోషలిస్టు పార్టీ అభ్యర్థి గులికోట శ్రీరాములు, 1994లో టీడీపీ అభ్యర్థి చందుపట్ల రాంరెడ్డి, 2014లో టీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధు కాంగ్రెస్‌ను ఓడించి రికార్డు సాధించారు.
- మిగతా 12 పర్యాయాలు కాంగ్రెస్ అభ్యర్థులు సునాయాసంగా విజయం సాధించి మంథనిని తమ పార్టీ కంచుకోటగా మార్చుకున్నారు.
- 1983లో ఎన్టీఆర్ టీడీపీ ప్రభంజనంలోనూ మంథని ఓటర్లు ప్రలోభాలకు లోనుకాకుండా, సినీ గ్లామర్‌ను లెక్కచేయకుండా విలక్షణమైన తీర్పు ఇచ్చారు.

సీఎంగా పీవీ, స్పీకర్‌గా శ్రీపాద..

- దేశప్రధానిగా సేవలు అందించిన పీవీ నరసింహారావుకు రాజకీయ ఓనమాలు నేర్పిన నియోజకవర్గం మంథని. 1957 నుంచి 1972వరకు నాలుగు పర్యాయాలు మంథని ఎమ్మెల్యేగా విజయం సాధించారు. మంత్రివర్గంలో కీలక పదవులు అధిష్ఠించారు. చివరకు సీఎం పీఠం కూడా అధిష్ఠించారు. 1983 నుంచి 1999వరకు జరిగిన మూడు ఎన్నికల్లోనూ దుద్దిళ్ల శ్రీపాదరావుకు పట్టంకట్టి శాసనసభకు మంచి శాసన సభాపతిని అందించిన ఘనత మంథని ఓటర్లదే. రాజకీయ అజ్ఞానం మంథని ఓటర్ల సొంతమన్న అభిప్రాయం అప్పట్లో ఉన్నా.. వీరు అందించిన నేతలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం తమ ఓటర్ల అదృష్టంగా భావిస్తున్నారు. నక్సల్స్ చేతిలో హతమైన శ్రీపాదరావు తర్వాత రాజకీయ అరంగ్రేటం చేసిన ఆయన తనయుడు శ్రీధర్‌బాబు.. 1999, 2004, 2009లో జరిగిన ఎన్నికల్లో వరుస విజయాలు నమోదు చేసుకున్నారు. 2018లోనూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మంథని అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించి రాజకీయ ప్రత్యేకతకు చోటుకల్పించారు.



పీవీ నరసింహారావు



శ్రీపాదరావు



శ్రీధర్‌బాబు



పుట్ట మధు

ఎన్నికలపై కుల ప్రభావం..

- నియోజకవర్గంలో 2,30,387మంది ఓటర్లు ఉండగా, అత్యధికంగా 29,339మంది మాదిగ, 28,433మంది పద్మశాలీ, 25,944మంది మున్నూరుకాపు సామాజిక వర్గాలు ఉన్నాయి. మిగతా ఓటర్లు ఇతర సామాజిక వర్గాలకు చెందిన వారు ఉన్నారు.
- మంథని నుంచి అసెంబ్లీ బరిలో ఉండేందుకు ఆసక్తి చూపుతున్న పుట్ట మధు, కర్రు నాగయ్య మున్నూరుకాపు సామాజికవర్గానికి చెందిన వారే.
- అలాగే మాల కులస్తులు 23,465 మంది, గౌడ సామాజికవర్గం కులస్తులు 20వేల పైచిలుకు ఉన్నారు.
- మొత్తంమీద బీసీల ఆధిపత్యమే కనిపిస్తోంది.

ఆధ్యాత్మిక క్షేత్రం..

- మంథని నియోజకవర్గం ఆధ్యాత్మిక క్షేత్రం. దక్షిణ కాశీగా పేరొందిన కాళేశ్వర క్షేత్రం ప్రాచీన చరిత్రకు నిలువుటద్దం. మంత్రపురి వేదాలకు పుట్టినిల్లు. వేయి ఏళ్లకుపైగా మహోన్నత చరిత్ర కలిగిన మంథని ఆలయాలకు నిలయమై టెంపుల్ టౌన్‌గా ప్రసిద్ధికెక్కింది. దేశంలో ఎక్కడా లేనివిధంగా వినాయకుని గుడి, దక్షిణభారతదేశంలో ఏకైక పశ్చిమముఖ శివలింగం ఇక్కడే దర్శనమిస్తాయి. అన్ని దేవతల ఆలయాలు ఇక్కడ ఉన్నాయి.

ఇంటికో ఇంజనీర్.. వీధికో డాక్టర్..

- మంథని నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో అమెరికాతోపాటు ప్రపంచంలోని అన్నిదేశాల్లో ఉన్నత చదువులు, ఉద్యోగాలకు వలస వెళ్లి స్థిరపడినవారు ఉన్నారు. ఇక్కడ వందలాది మంది వైద్యులు, ఇంజనీర్లు ఉన్నారు.

అన్నికులాలకు సమాన ప్రాతినిధ్యం



దళిత సంఘాల ఐక్యవేదిక సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని: బీఆర్ఎస్ పాలనలో అన్ని కులాలకు సమాన ప్రాతినిధ్యం లభించిందని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. బుధవారం స్థానిక ఆర్యవైశ్యభవన్‌లో నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం నిర్వహించారు. పోలీస్ హౌసింగ్ బోర్డు చైర్మన్ కోలేటి దామోదర్‌తో కలిసి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఆర్యవైశ్యులకు తాము ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్నామన్నారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ అధ్యక్షుడు వెనిశెట్టి నటరాజశేఖర్, ప్రధాన కార్యదర్శి మోతిశెట్టి ఆనంద్‌బాబు, కోశాధికారి చిట్టిమల్ల కిశోర్, మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ టి.లక్ష్మీవాణి, ప్రధాన కార్యదర్శి గందె శ్రీ భవాని, కోశాధికారి గాదె స్రవంతి బాధ్యతలు స్వీకరించారు. కార్పొరేషన్ మేయర్ బంగి అనిల్‌కుమార్, కార్పొరేటర్ బాలరాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు మద్దతు..

బీఆర్ఎస్‌కు ఆల్ మెకానిక్ సొసైటీ మద్దతు ప్రకటించింది. ఈమేరకు తీర్మానం చేసినట్లు అధికార ప్రతినిధి జాహిద్‌పాషా తెలిపారు.

ఇంటింటా ప్రచారం..

రెండో డివిజన్‌లో కో ఆప్షన్ సభ్యురాలు తస్నీంభాను ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారుగుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. నైమా ఫర్హానా, సాజిదా, మైమూనా, జుబేదా పాల్గొన్నారు.

'సీ విజిల్'లో ఫిర్యాదు చేయండి

జ్యోతినగర్(రామగుండం): ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై సీ విజిల్‌యాప్, టోల్‌ఫ్రీ నంబర్ల ద్వారా ఫిర్యాదు చేయాలని రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ సూచించారు. మద్యం, డబ్బు పంపిణీ, అసత్య సమాచారం, విద్వేషపూరిత, ఉచితాలు, మత్తు పదార్థాల రవాణా, బెదిరింపులను సీ-విజిల్ యాప్, టోల్‌ఫ్రీ నంబర్ 18004256521కు ఫిర్యాదు చేయాలని ఆమె సూచించారు. వీటిపై తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పొరపాటు జరిగితే తిప్పలే..!

- రేపటినుంచే నామినేషన్ల స్వీకరణ
- సమగ్ర సమాచారం సేకరించే పనిలో అభ్యర్థులు
- న్యాయ నిపుణుల సలహాలతో ముందుకు
- జాతకం చూపించుకుంటున్న వైనం
- కలిసి వచ్చే తేదీన నామినేషన్ వేసేందుకు సన్నాహాలు

పార్టీలు ప్రకటించిన అభ్యర్థులు

బీఆర్ఎస్	13	బీజేపీ	9
కాంగ్రెస్	11	బీఎస్పీ	10

నామినేషన్లు, అఫిడవిట్ల దాఖలు సహా ఎన్నికల సంఘం నిబంధనలను పాటించడంలో ఏమాత్రం నిర్లక్ష్యం చూపినా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ఇంతకుముందు మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు వనమా, కృష్ణమోహన్‌రెడ్డి వంటి నేతలు భారీ మెజారిటీతో గెలుపొందినా అఫిడవిట్లలోని కొన్ని సాంకేతిక అంశాలతో ఇబ్బంది పడ్డారు. రిటర్నింగ్ అధికారులకు సమర్పించే అఫిడవిట్లు అక్టోబర్ 21లోపు బీఆర్ఎస్ లీగల్ సెల్‌కు అందజేయాలి. వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తాం. పొరపాటు జరిగితే తిప్పలు తప్పవంటూ గత నెలలో తమ అభ్యర్థులకు సీఎం కేసీఆర్ హెచ్చరిక జారీ చేశారు. దీంతో బీఆర్ఎస్ అభ్యర్థులతోపాటు, విపక్ష పార్టీలు సైతం తమ నామినేషన్, అఫిడవిట్‌ల దాఖలుకు న్యాయనిపుణుల సలహాలు తీసుకుంటున్నారు.



జ్యోతినగర్ : ఎన్టీపీసీలోని నామినేషన్ స్వీకరణ కేంద్రంలో అధికారులకు సూచనలిస్తున్న ముజమ్మిల్‌ఖాన్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఘట్టం రేపటి నుంచి(శుక్రవారం) మొదలుకానుంది. అభ్యర్థులు నామినేషన్ వేసుందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థులు నామినేషన్ వేసేటప్పుడు సమర్పించాల్సిన అఫిడవిట్ తదితర అంశాల మీద ఫోకస్ చేసి, భవిష్యత్‌లో సమస్యలు తలెత్తకుండా ఉండేలా న్యాయనిపుణుల సలహాలతో పకడ్బందీగా ఏర్పాట్లు చేసుకున్నారు. టికెట్లు ఖరారైన విపక్ష పార్టీల అభ్యర్థులు సైతం సమగ్ర సమాచారం సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఓవైపు ప్రచారంలో పాల్గొంటూనే మరోవైపు తమ బంధువులు, సన్నిహితుల సాయంతో న్యాయనిపుణులతో ఒకటికి రెండుసార్లు క్రాస్ చెక్ చేసుకుంటున్నారు. వ్యక్తిగత వివరాలు, తమతోపాటు తమ కుటుంబసభ్యుల పేరు మీద ఉన్న స్థిర, చరాస్తుల వివరాలను, నేరారోపణలకు సంబంధించిన అంశాలు, ట్రాఫిక్ చలాన్లు, ఫోన్, విద్యుత్ బిల్లుల బకాయిలు, ఆదాయ పన్ను రిటర్న్‌లు వంటివి జాగ్రత్తగా స్క్రూటినీ చేయించుకుంటున్నారు.

కేసుల వివరాల కోసం డీజీపీకి లేఖలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పలువురు అభ్యర్థులపై రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్లలో తమపై నమోదైన కేసుల వివరాల కోసం డీజీపీకి లేఖలు రాస్తున్నారు. అలాగే అభ్యర్థులు, తమ కుటుంబసభ్యుల పేరు మీద ఉన్న వాహనాలపై ట్రాఫిక్ చలాన్లు, పన్ను బకాయిలు చెల్లించి, నో డ్యూ సర్టిఫికెట్స్ తీసుకుంటున్నారు.

ఆ 4 రోజుల్లోనే అధిక నామినేషన్లు..

నామినేషన్ మంచి రోజు వేయాలని భావిస్తున్న నేతలు తమకు నమ్మకమైన పండితులను సంప్రదిస్తున్నారు. తమ పేరిట ఏరోజు నామినేషన్ వేస్తే విజయం సిద్ధిస్తుందని తెలుసుకుంటున్నారు. మరికొందరు నేతలు దోషాలు పోయేందుకు పూజలు చేస్తున్నారు. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనుండగా, ఆయా రోజుల్లో తిథి, నక్షత్ర బలం చూయించుకుంటున్నారు. అభ్యర్థుల జాతక రీత్యా ప్రధానంగా 3, 4, 8, 9 తేదీల్లో నామినేషన్ దాఖలు చేస్తే విజయం వరిస్తుందని పండితులు సూచిస్తున్నారు. దీంతో ఈ నాలుగు రోజుల్లోనే నామినేషన్లు అధికంగా పడనున్నాయి.

ఇబ్బందులు రాకుండా డమ్మీల ఎంపిక

ఆర్వోకు సమర్పించే నామినేషన్, అఫిడవిట్‌లలో తప్పులు, అక్షర దోషాలు, ప్రతిపాదించే అనుచరుల వివరాల్లో ఎటువంటి తప్పులు లేకుండా స్క్రూటినీ చేయిస్తున్నారు. అలాగే తమ నామినేషన్ తిరస్కరిస్తే బరిలో నిలిచేలా కుటుంబసభ్యులను డమ్మీలుగా ఎంపిక చేసుకుంటున్నారు. వారి పేరుతో సైతం నామినేషన్లు, అఫిడవిట్లు తయారు చేయించే పనిలో నేతలు ఉన్నారు. అన్ని పార్టీల కంటే బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రకటన ముందే వెలువడటంతో వారు ఈ తతంగం పూర్తి చేసి, మొదటిరోజే నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. విపక్ష అభ్యర్థులు సైతం అధికార పార్టీ లీగల్ సెల్‌కు దొరకుండా ఉండేందుకు ఆయా పార్టీల అనుబంధ లీగల్ టీంలతో సంప్రదింపులు జరుపుతున్నారు.

అన్ని కాలమ్‌లు నింపాలి

కరీంనగర్ అర్బన్: జిల్లాలోని కరీంనగర్, హుజూరాబాద్, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల్లో వారం రోజులపాటు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. జాతీయ, రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులు నామినేషన్ వేసే సమయంలో వారిని తమ నియోజకవర్గానికి చెందిన ఒక ఓటరు ప్రతిపాదించాలి. రిజిష్టర్డ్ పార్టీ, స్వతంత్ర అభ్యర్థులైతే 10 మంది ప్రతిపాదించాల్సి ఉంటుంది. ప్రతిపాదించేవారు నిరక్షరాస్యులైతే ఆర్వో ఎదుట నామినేషన్ స్వీకరణ సమయానికి ముందు, తర్వాత వేలిముద్ర వేయాలి. వారి సంతకాన్ని అభ్యర్థులు ఫోర్జరీ చేసినట్లు విచారణలో తేలితే నామినేషన్ తిరస్కరణకు గురికావడంతోపాటు కేసు నమోదు చేయనున్నారు. అభ్యర్థులు ఫాం–2బీ ద్వారా నామినేషన్, ఫాం–26 ద్వారా అఫిడవిట్ దాఖలు చేయాలి. అఫిడవిట్‌లో అన్ని కాలమ్‌లు నింపాలి. ఏదైనా వదిలేస్తే పూరించేలా ఆర్వో సహకరించనున్నారు. నామినేషన్ కేంద్రాలకు వెళ్లడానికి అభ్యర్థితోపాటు మరో నలుగురికి మాత్రమే అవకాశం కల్పిస్తారు. అభ్యర్థులు నామినేషన్‌తోపాటు ఏదైనా జాతీయబ్యాంకు నుంచి కొత్తగా ఖాతా తెరిచి, వివరాలు అందించాలి. ఎన్నికలు పూర్తయ్యే వరకు అదే ఖాతా నుంచి లావాదేవీలు నిర్వహించాలి. ఎమ్మెల్యేగా నామినేషన్ వేసే సాధారణ అభ్యర్థులు రూ.10 వేలు డిపాజిట్ చేయాలి. అదే ఎస్సీ, ఎస్టీలైతే రూ.5 వేలు చెల్లిస్తే సరిపోతుంది.

జిల్లాలోని నామినేషన్ల స్వీకరణ కేంద్రాలు..

నియోజకవర్గం	కేంద్రం	ఆర్వో పేరు
కరీంనగర్	కరీంనగర్ ఆర్డీవో కార్యాలయం	కె.మహేశ్వర్
హుజూరాబాద్	ఆర్డీవో కార్యాలయం (కేసీ క్యాంపు)	ఎస్.రాజు
చొప్పదండి	తహసీల్దార్ కార్యాలయం, చొప్పదండి	ప్రఫుల్ దేశాయ్
మానకొండూర్	మానకొండూరు తహసీల్దార్ కార్యాలయం	లక్ష్మీకిరణ్

నామినేషన్ల స్వీకరణకు సర్వం సిద్ధం

- రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: అసెంబ్లీ నామినేషన్ల స్వీకరణ శుక్రవారం ప్రారంభం కానుందని, ఈమేరకు ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి ముమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్, రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో నామినేషన్ల స్వీకరణపై కలెక్టర్, ఎన్నికల అధికారి సమీక్షించారు.

3న నోటిఫికేషన్ విడుదల

అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ ఈనెల 3న విడుదలవుతుందని కలెక్టర్ తెలిపారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరించాలని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలని, నామినేషన్ దరఖాస్తుల దాఖలు ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో, సజావుగా సాగేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

ఆర్వో కార్యాలయం.. ఆన్‌లైన్‌లో..

నామినేషన్ ఫారాలను ఆన్‌లైన్, రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అందుబాటులో ఉంచామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. అభ్యర్థులు వాటిని సంపూర్ణంగా చదివి పూర్తిచేసి, అఫిడవిట్, లేటెస్ట్ ఫొటో జతచేసి అధికారులకు సమర్పించాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలు, ఖర్చు వివరాలు, రేట్‌చార్ట్, వ్యయ రిజిష్టర్, ఓటరు జాబితా సమాచారం ఇదేసమయంలో అందించాలని అధికారులకు సూచించారు. అభ్యర్థులు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100మీటర్ల దూరం వరకు ర్యాలీలను నిర్వహించరాదని పేర్కొన్నారు. కార్యాలయాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయించేటపుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. అభ్యర్థి పేరు తప్పనిసరిగా తెలుగులో ఎలా రాయాలో కోరాలని సూచించారు. ఆర్వో కార్యాలయ ఆవరణలో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు. రిటర్నింగ్ అధికారులు మధుమోహన్, హనుమానాయక్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, సూపరింటెండెంట్ బండి ప్రకాశ్, డెప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

న్యాయవాద దంపతుల కేసు వాయిదా

మంథని: హైకోర్టు న్యాయవాద దంపతులు గట్టు వామన్‌రావు– నాగమణి హత్య కేసు వచ్చే నెల 7వ తేదీకి వాయిదా పడింది. బుధవారం పెద్దపల్లి జిల్లా ప్రధాన న్యాయస్థానంలో విచారణ జరిగింది. కేసులో ఆరుగురు నిందితులు కోర్టుకు హాజరయ్యారు. అయితే, తదుపరి విచారణను డిసెంబర్ 7వ తేదీకి కోర్టు వాయిదా వేసింది.

క్లుప్తంగా

కాంగ్రెస్‌లోకి ధర్మారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

ధర్మారం(ధర్మపురి): ధర్మారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొత్త నర్సింహం బుధవారం సాయంత్రం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన నర్సింహం కొంతకాలంగా బీఆర్‌ఎస్ పార్టీకి దూరంగా ఉంటున్నారు. గతంలో గ్రామ సర్పంచ్‌గా పని చేశారు. ప్రస్తుతం ఆయన సతీమణి లక్ష్మి గ్రామ సర్పంచ్‌గా కొనసాగుతున్నారు.

కాంగ్రెస్‌కు 'ఈర్ల' గుడ్‌బై


ఈర్ల కొమురయ్య


పెద్దపల్లిరూరల్: కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ ఈర్ల కొమురయ్య బుధవారం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అంకిత భావంతో సేవలందించిన తనను పార్టీ విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండురోజుల్లో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని కొమురయ్య తెలిపారు.

సన్మానం


సన్మానిస్తున్న బాల్యమిత్రులు

రామగుండం: ఇటీవల ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగిన ఆర్యవైశ్య సంఘం ఎన్నికల్లో ముస్త్యాల రమేశ్ జిల్లా కెమిస్టు–డ్రగ్గిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరెక్టర్‌గా విజయం సాధించారు. ఈ నేపథ్యంలో బుధవారం రామగుండం హైస్కూల్‌కు చెందిన బాల్యమిత్ర బృందం కరీంనగర్‌లో రమేశ్–రేవతి దంపతులను గజమాలతో సత్కరించారు. అబ్దుల్ తకీ, ఆరుముళ్ల రాజయ్య, గుజ్జుల రమణారెడ్డి, రాపోలు రవీందర్‌రావు, కందుల స్వామి, ముక్కెర శ్రీనివాస్, తూళ్ల శ్రీనివాస్ తదితరులున్నారు.

నియామకం


నియామక పత్రం అందిస్తున్న మక్కాన్‌సింగ్

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎస్సీ సెల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా 14వ డివిజన్ లక్ష్మీపురం కొత్తగేట్‌కు చెందిన కన్నూరి శంకర్‌ను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ నియమించారు. ఈసందర్భంగా శంకర్ మాట్లాడుతూ, రామగుండం కాంగ్రెస్ అభ్యర్థి మక్కాన్‌సింగ్ భారీ మెజార్టీతో గెలిచేలా కృషి చేస్తామని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన మున్సిపల్ కార్పొరేషన్ పట్టణ అధ్యక్షుడు బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ ఉపేందర్, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చుక్కల శ్రీను, చిట్టబోయిన స్వరూపరాజ్‌కుమార్, సతీశ్, బండా రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

హత్యచేసి.. రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి..

- ప్రియుడితో భర్తను చంపించిన భార్య
- పోలీసుల విచారణలో వెలుగులోకి..
- నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఏసీపీ శ్రీనివాస్‌రావు


కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ, సీఐ, ఎస్సైలు

రామగుండం: తన భర్తను అడ్డు తొలగిస్తే.. సింగరేణి ఉద్యోగం చేసుకుంటూ ఇద్దరం హాయిగా ఉండొచ్చని చెప్పి ప్రియుడితో భర్తను హత్య చేయించింది ఓ మహిళ. అంతేకాదు.. తన భర్త రోడ్డు ప్రమాదంలో చనిపోయినట్లు చిత్రీకరించింది కూడా.. రంగంలోకి దిగిన పోలీసులు.. కూపీ లాగడంతో అసలు విషయం వెలుగుచూసింది. పెద్దపల్లి జిల్లా రామగుండం పోలీసుస్టేషన్ పరిధిలోని మల్యాలపల్లి సబ్‌స్టేషన్ వద్ద రాజీవ్‌రహదారిపై జరిగిన ఈ ఘటన వివరాలను రామగుండం ఏసీపీ తులా శ్రీనివాస్‌రావు బుధవారం విలేకరులకు వెల్లడించారు.. ఆయన కథనం ప్రకారం.. గోదావరిఖని యైటింక్లయిన్‌కాలనీ సమీప పోతనకాలనీకి చెందిన సింగరేణి ఉద్యోగి లావుడ్య మధుకర్–రమ దంపతులు. వీరికి ముగ్గురు సంతానం ఉన్నారు. రమ తనకు తెలిసిన వారికి పెళ్లి సంబంధం కుదిర్చేక్రమంలో ధరావత్ గోవర్ధన్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఇది గోవర్ధన్, రమ మధ్య వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈక్రమంలో గోవర్ధన్ తరచూ రమ ఇంటికి వస్తూ పోతున్నాడు. కొన్నిసార్లు రెండుమూడ్రోజులు ఇక్కడే ఉండేవాడు. దీంతో మధుకర్‌కు తన భార్యపై అనుమానం వచ్చింది. పద్ధతి మార్చుకోవాలని ఆమెను హెచ్చరించాడు. తన వ్యవహారానికి అడ్డువస్తున్నాడనే ఆగ్రహంతో భర్తను అడ్డు తొలగించుకోవాలని ప్రియుడితో కలిసి రమ కుట్ర పన్నింది. మధుకర్‌ను చంపితే సింగరేణి ఉద్యోగం కూడా వస్తుందని, ఇద్దరమూ హాయిగా ఉండొచ్చని చెప్పింది. ఇందుకు అంగీకరించిన గోవర్ధన్.. మరో ఇద్దరు మిత్రుల సాయం తీసుకుని మధుకర్ హత్యకు అక్టోబర్ 29న ప్లాన్ చేశాడు. అదేరోజు మధుకర్ మధ్యాహ్నం విధులు ముగించుకొని ఇంటికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న గోవర్ధన్ తన స్నేహితులు నాగరాజు, లక్ష్మణ్‌తో కలిసి గోదావరిఖని వచ్చారు. గోవర్ధన్ తన ప్రియురాలు రమకు ఫోన్‌చేశాడు. మధుకర్‌తో మాట్లాడాలని చెప్పాడు. ఈక్రమంలో పల్సర్ బైక్‌పై ఫైవింక్లయిన్ వద్ద గల ఓ వైన్‌షాపులోకి మధుకర్ వచ్చాడు. అక్కడ అందరూ కలుసుకొని మద్యం కొనుగోలు చేశారు. ఆ తర్వాత మల్యాలపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని చెట్లపొదల్లోకి వచ్చి మద్యం తాగుతూ ఉన్నారు. గోవర్ధన్ తన వెంట తెచ్చుకున్న ఇనుపరాడు పట్టుకుని, తన ఇద్దరు మిత్రులతో కలిసి మధుకర్‌పై దాడిచేశారు. తీవ్రగాయాలతో మధుకర్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని రోడ్డు పక్కన ఉన్న కాలువలో పడేశారు. రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు బైక్‌ను మృతదేహంపై పడేయాలని యత్నించినా.. అదుపుతప్పి పక్కకు పడింది. ఆ తర్వాత హత్య విషయాన్ని గోవర్ధన్ వాట్సాప్‌కాల్ ద్వారా రమకు తెలిపాడు. అక్కడినుంచి ముగ్గురు నిందితులు పారిపోయారు. రమ వ్యవహారశైలిపై మృతుడి తండ్రి నాన్యానాయక్ అనుమానం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు ఆ దిశగా విచారణ చేపట్టడంతో విషయం వెలుగులోకి వచ్చింది. నిందితులు లావుడియా(నునసవత)రమ, ధరావత్ గోవర్ధన్ (నాచారం, మల్హర్ మండలం), కోట లక్ష్మణస్వామి (కొత్తపల్లి, జయశంకర్ జిల్లా), కర్నే నాగరాజు (ఖాసీంపెల్లి, జయశంకర్ జిల్లా)ను అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశారు. హత్య జరిగిన 48 గంటల్లోనే రామగుండం సీఐ, ఎస్సైలు కేసును ఛేదించడంతో ఏసీపీ అభినందించారు.

దాతలూ దయచూపండి

- కాళ్లు, చేతులు చచ్చుబడి.. మంచానికే పరిమితమై
- వైద్యానికి డబ్బు లేక చావు బతుకుల్లో హమాలీ
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు


మంచానికే పరిమితమైన శ్రీనివాస్

ఓదెల(పెద్దపల్లి): హమాలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునే కార్మికుడు పక్షవాతంతో మంచానికే పరిమితమయ్యాడు. వైద్యానికి డబ్బు లేక ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నాడు. ఓదెల మండలం కొమిర గ్రామానికి చెందిన నాగపూరి శ్రీనివాస్‌గౌడ్ నాలుగు నెలల క్రితం హైబీపీతో పక్షవాతానికి గురికాగా, కాళ్లు, చేతులు చచ్చుబడిపోయాయి. అతడికి భార్య శ్రీలత, ఇద్దరు కూతుర్లు అంజలి, భార్గవి ఉన్నారు. శ్రీనివాస్ పని చేస్తేనే కుటుంబం గడిచే పరిస్థితి. మంచానికే పరిమితం కావడంతో వైద్యంకోసం కుటుంబసభ్యులు తెలిసినవారి వద్ద రూ.10లక్షల వరకు అప్పు చేసి ఆపరేషన్ చేయించారు. అయినా కోలుకోలేదు. నాలుగు నెలల నుంచి కుటుంబ పోషణ భారం కావడంతో ఇద్దరు ఆడపిల్లలు చదువుకు దూరమయ్యారు. వైద్యానికి దాతలు సాయం చేస్తే కోలుకుంటాడని శ్రీనివాస్ కుటుంబసభ్యులు ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం మూత్రపిండాల్లో రాళ్ల తొలగింపునకు ఆపరేషన్ చేయాలని డాక్టర్లు చెప్పారని కుటుంబసభ్యులు రోదిస్తూ తెలిపారు. ఆపరేషన్‌కు రూ.5లక్షలు అవుతాయని, తమ వద్ద చిల్లిగవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాతలు మానవత్వంతో సాయం చేసి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

దాతలు సాయం చేయాల్సిన ఫోన్‌పే నంబర్: **96761 73272**

కాంగ్రెస్‌లోకి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్


పార్టీలోకి ఆహ్వానిస్తున్న మక్కాన్‌సింగ్

రామగుండం: అంతర్గాం మండలం ముర్మూర్ గ్రామానికి చెందిన పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ జూల లింగయ్య–ప్రేమలత దంపతులు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఠాకూర్ మాట్లాడుతూ, అంతర్గాం మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు తన పట్ల చూపుతున్న ఆదరణ మరువలేనిదన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన తక్షణమే మండల పరిధిలోని సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తానని హామీ ఇచ్చారు.

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): యైటింక్లయిన్ కాలనీ బీఆర్‌ఎస్ పార్టీ మహిళా పట్టణ ప్రధాన కార్యదర్శి కందుల లక్ష్మీకళ, యూత్ నాయకుడు బుధవారం డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాలనీ పట్టణ అధ్యక్షుడు రాజేశ్, కార్పొరేటర్ శంకర్‌నాయక్, ఐరెడ్డి సంపత్‌రెడ్డి, వీరారెడ్డి, రమేశ్‌రెడ్డి, కిషన్ నాయక్, రవి తదితరులు పాల్గొన్నారు.

గోదావరిఖని(రామగుండం): పలువురు బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాగూర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. చేరిన వారిలో తెలంగాణ కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ సమన్వయ కమిటీ సభ్యుడు మద్దెల శ్రీనివాస్, బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి ఖాజా సిరాజోద్దీన్, నాయకులు మహమ్మద్ మునీరుద్దీన్, ఎండీ నయీమ్‌పాషా, ఎస్‌కె కరీం, ఖాజా మజహర్ ఉన్నారు.

సీఎం కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి


పార్టీలోకి ఆహ్వానిస్తున్న శంకర్‌రెడ్డి, మధు

మంథని: అసెంబ్లీ ఎన్నికల్లో మంథనిలో బీఆర్‌ఎస్ జెండా ఎగరడం ఖాయమని మంథని నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి, ఐడీసీ మాజీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మంథనిలోని జెడ్పీ చైర్మన్ నివాసంలో అభ్యర్థి పుట్ట మధు సమక్షంలో ఆయా మండలాలకు చెందిన పలువురు పార్టీలో చేరారు. మహాముత్తారం మండలం ములుగుపల్లి గ్రామానికి చెందిన 50 మంది, మల్హర్ మండలం ఎడ్లపల్లి గ్రామానికి చెందిన సుమారు 100 మంది పార్టీలో చేరగా, కండువాలు కప్పి ఆహ్వానించారు. ప్రభుత్వం, సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతో పాటు నియోజకవర్గంలో జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ చేస్తున్న సేవలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు వారు ప్రకటించారు.

హెచ్ఎంఎస్ జాతీయ శిక్షణ శిబిరానికి ఎంపిక


ఉపేందర్

జ్యోతినగర్(రామగుండం): కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూరులో ఈనెల 3, 4వ తేదీల్లో జరుగనున్న హెచ్ఎంఎస్ జాతీయ శిక్షణా తరగతులకు ఎన్టీపీసీ రామగుండంకు చెందిన హెచ్ఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.ఉపేందర్ తెలంగాణ నుంచి హాజరుకానున్నారు. రాష్ట్రానికి ఐదుగురు చొప్పున తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన హెచ్ఎంఎస్ నాయకులు హాజరవుతారు. జర్మనీకి చెందిన ఫ్రెడ్రిక్ ఎబెర్ట్ షెటుంగ్ సంస్థ సహకారంతో హెచ్ఎంఎస్ అనుబంధ సంస్థ మనిబెన్ కారా ఇన్‌స్టిట్యూట్ సంయుక్తంగా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. రెండు రోజుల శిక్షణ తరగతుల్లో జర్మనీకి చెందిన అధికారితో పాటు హెచ్ఎంఎస్ జాతీయ ప్రధాన కార్యర్శి హర్భజన్‌సింగ్ సిద్దుతో పాటు పలువురు పాల్గొంటారు. నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మికవర్గానికి తలెత్తే సమస్యలు, కార్మికుల హక్కులపై వాటి ప్రభావం వంటి అంశాలను విస్తృతంగా చర్చించి ఒక నివేదికను అందించనున్నట్లు ఉపేందర్ తెలిపారు.

వేదవిద్యకు పూర్వవైభవం

- జిల్లాకు వందమంది వేదపండితులు
- జనార్దనానంద సరస్వతీస్వామి సంస్కృతి ట్రస్ట్ చైర్మన్ శాయినాథశర్మ
- మంథనిలో తెలంగాణ స్థాయి వేదమహాసభలు ప్రారంభం


మాట్లాడుతున్న ట్రస్టు చైర్మన్ శాయినాథశర్మ

మంథని: వేదవిద్యకు పూర్వవైభవం తీసుకొస్తామని, ఇందులో భాగంగానే మంత్రపురిలో తెలంగాణస్థాయి వేదవిద్య మహాసభలు నిర్వహిస్తున్నామని జనార్దనానంద సరస్వతీస్వామి సంస్కృతి ట్రస్టు చైర్మన్ తూములూరి శాయినాథశర్మ తెలిపారు. స్థానిక నృసింహ శివకిరణ్ గార్డెన్‌లో బుధవారం ప్రారంభమైన సభల్లో సేవాసదన్ వ్యవస్థాపకుడు గట్టు నారాయణ గురూజీతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. అనేక ఘనాపాఠీలతో తెలంగాణలో వేదవిద్య ఫరిడవిల్లేదని, వేదాన్ని పరిరక్షించడానికి జనార్దనానంద సరస్వతీస్వామి 2002 నుంచి కృషి చేస్తున్నారన్నారు. వేదవిద్యార్థులు రాజమండ్రికి వెళ్లి పరీక్షలు రాయాల్సి వచ్చేదని, కానీ, తెలంగాణలో తమ ట్రస్టు ద్వారా పరీక్షలకు అవకాశం కల్పించి, ప్రభుత్వ అనుమతితో సర్టిఫికెట్లు అందిస్తున్నామని అన్నారు. ఈమేరకు 23 జిల్లాల్లోని వేదపాఠశాలలకు చెంది 500 మంది విద్యార్థులతో మంథనిలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తొలిసారి మంథనిలో 500మందితో వేదమహా సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేదం అన్నింటికీ మూలమని, దానిని సంరక్షించుకోవాల్సి బాధ్యత ప్రతీభారత పౌరుడిపై ఉందన్నారు. జిల్లాకు వంద మంది వేదపండితులను తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. శనివారం వెయ్యి మందితో శోభాయాత్ర నిర్వహిస్తామని అన్నారు. ట్రస్టు కార్యదర్శి బ్రహ్మానందశర్మ, సేవా సదన్ అధ్యక్షుడు హరిబాబు, సభ్యులు శశిభూషణ్ కాచే, నల్లగొండ హరి, దుద్దిళ్ల గణపతి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు షురూ

- ప్రారంభించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

జిల్లా సమాచారం

కొనుగోలు కేంద్రాలు	305
వరి సాగు విస్తీర్ణం(ఎకరాల్లో)	2,01,408
దిగుబడి అంచనా (లక్షల మెట్రిక్ టన్నుల్లో)	4.90


కొనుగోళ్లు ప్రారంభిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అధికారులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు మొదలయ్యాయి. వరికోతలు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. ఇప్పటికే కోతలు కోసిన రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించే పనుల్లో నిమగ్నమయ్యారు.

14 మండలాలు.. 2.0లక్షల ఎకరాల్లో సాగు..

- జిల్లాలోని 14 మండలాల్లో వానాకాలం వరి 2,01,408 ఎకరాల్లో సాగైందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.
- ఈసారి 4.90లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు.
- కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చిన రైతులకు ఇబ్బందులు కలుగకుండా అన్నిఏర్పాట్లు చేసే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు.
- జిల్లాలో 305 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- ఇందులో 236 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, సెర్ప్ ఆధ్వర్యంలో 64 కేంద్రాలు, 5 మార్కెట్ కమిటీల ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాలు ఉన్నాయి.

టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు సిద్ధం..

రైతులు కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని నిబంధనలకు అనుగుణంగా చెత్త, చెదారం, మట్టిపెల్లలు తొలగించేందుకు అవసరమైన ప్యాడీ క్లీనర్లు, తూర్పార పట్టే యంత్రాలు, తేమ శాతం నిర్ధారించే పరికరాలు, తూకం యంత్రాలు సిద్ధంగా ఉంచామని అధికారులు తెలిపారు. దాదాపు 50లక్షల దాకా గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయన్నారు.

ఈసారి పెరిగిన మద్దతు ధర

- కేంద్రప్రభుత్వం ఈసారి ధాన్యానికి మద్దతు ధర పెంచింది.
- పెరుగుతున్న పెట్టుబడులకు అనుగుణంగా మద్దతు ధర పెంచి రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.
- గతేడాదికన్నా క్వింటాలుపై రూ.143 చొప్పున ధర పెంచగా బుధవారం నుంచి ఆ ధర అమల్లోకి వచ్చింది.
- గతంలో సాధారణ రకం ధాన్యం క్వింటాలుకు రూ.2,040 ఉండగా ఇప్పుడు రూ.2,183కు చేరింది.
- ఏ– గ్రేడ్ రకానికి గతంలో రూ.2,060 ఉండగా, ఇపుడు రూ.2,203కు పెరిగింది.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

సుల్తానాబాద్(పెద్దపల్లి): రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ కోరారు. బుధవారం వ్యవసాయ మార్కెట్ కమిటీలో కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు వరి ధాన్యాన్ని ఆరబెట్టి మాయిశ్చర్ వచ్చిన తర్వాతే కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం జిల్లావ్యాప్తంగా 301 కేంద్రాలు ఏర్పాటు చేసిందని, కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలని కోరారు. ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాల్‌కు రూ.2,203, కామన్ రకానికి రూ.2,183 చెల్లిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ జిల్లా అధికారి ప్రవీణ్‌రెడ్డి, డీసీవో శ్రీమాల, జిల్లా అధికారులు అశోక్‌కుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరకే విక్రయించాలి

రైతులు కష్టపడి పండించిన పంటను కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధరకు విక్రయించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. జిల్లా కేంద్రంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. కల్లాల వద్ద దళారులకు విక్రయించి మోసపోవద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. సివిల్ సప్లయీస్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, డీఎంవో ప్రవీణ్‌రెడ్డి, డీసీవో శ్రీమాల, ఉమ్మడి జిల్లా డీసీఎమ్మెస్ మేనేజర్ వెంకటేశ్వర్లు, మార్కెట్‌కమిటీ కార్యదర్శి పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

– ముజమ్మిల్‌ఖాన్, కలెక్టర్

రైతుల వినతి

కొలు రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని పలువురు జిల్లా అధికారులకు విన్నవించారు. మాయిశ్చర్, తదితర కారణాలతో ఉద్యోగులు కాలయాపన చేస్తున్నారని, పైరవీలతోనే ధాన్యం కాంటాలు పెడుతున్నారని, సామాన్య రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కాగా అలాంటివి జరగకుండా చూస్తామని రైతులు సైతం మాయిశ్చర్ వచ్చిన తర్వాతే కేంద్రాలను తీసుకురావాలని అధికారులు కోరారు.

సొసైటీ తీరుపై సంతృప్తి

సుల్తానాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయడంతో సొసైటీ అభివృద్ధి చెందిందని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. బుధవారం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్, వాటర్ ప్లాంట్‌"సూపర్ మార్కెట్‌తోపాటు సంఘం పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. మిగతా సంఘాలు ఈ సంఘాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని సూచించారు.

హెచ్ఐవీపై క్విజ్


బహుమతి అందిస్తున్న డీఎంహెచ్‌వో

పెద్దపల్లిరూరల్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం హెచ్ఐవీ– ఎయిడ్స్‌పై విద్యార్థులకు డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, డెప్యూటీ డీఎంహెచ్‌వో కృపాబాయి అవగాహన కల్పించారు. తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు క్విజ్ నిర్వహించారు. విజేతలుగా నిలిచిన ఇద్దరికి నగదు పారితోషికం అందజేశారు. డీఐఎస్ శ్రీనివాస్, కౌన్సిలర్ శంకర్, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

'అవ్వా.. కారు గుర్తును మరవొద్దు'


వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే

పెద్దపల్లిరూరల్: 'అవ్వా.. నీ ఓటు నా కారు గుర్తుకే వేయాలి' అంటూ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పెద్దపల్లి మండలం పెద్దకల్వలకు చెందిన బత్తుల వీరమ్మను ఇలా ఓటు అభ్యర్థించారు. బుధవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

బొగ్గుబాయి వార్తలు

మెరుగైన వైద్యం అందించాలి

- రక్షణ కమిటీ కన్వీనర్ వెంకటేశ్వర్‌రావు


బహుమతి అందజేస్తున్న అధికారులు

గోదావరిఖని(రామగుండం): అధునాతన వసతులతో ముందుకు సాగుతున్న సింగరేణి ఆసుపత్రిలో ఉద్యోగుల కుటుంబాలకు మరింత మెరుగైన వైద్యం అందించాలని రక్షణ కమిటీ కన్వీనర్ కె.వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. బుధవారం 54వ రక్షణ పక్షోత్సవాలను పురస్కరించుకుని సింగరేణి ఏరియా ఆసుపత్రిని రక్షణ కమిటీ బృందం తనిఖీ చేసింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆసుపత్రిని నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కార్పొరేట్ ఆసుపత్రికి దీటుగా చికిత్స అందించాలన్నారు. గతేడాది వచ్చిన ఓవరాల్ రెండో బహుమతిని ఆసుపత్రి సిబ్బందికి అందించారు. ముగ్గురు ఉత్తమ ఉద్యోగులు స్టాఫ్‌నర్స్ మనీషా, వరలక్ష్మి, సీనియర్ టెక్నీషియన్ శ్రీలతకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మెడికల్ ఆఫీసర్ పి.రమేశ్‌బాబు, సభ్యులు హరిశంకర్‌రావు, పి.శేషగిరిరావు, ఏరియా ఆసుపత్రి డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్‌రాజ్‌కుమార్, రీజియన్ సేఫ్టీ జీఎం ఎస్.సాంబయ్య, డాక్టర్లు అంబిక, అరవింద్, సుమన్, సీనియర్ పీవో హన్మంతరావు, సీనియర్ టెక్నీషియన్ యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు ఫ్రీ మెడికల్ టెస్ట్

గోదావరిఖని(రామగుండం): సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఫ్రీ మెడికల్ ఐఎంఈ, పీఎంఈ చేయనున్నట్లు యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు సీఆర్‌పీ/పీఈఆర్/ఐఈఆర్/ఐ/302/1306 పేరున ఉత్తర్వులు వెలువడ్డాయి. పర్చేజ్ ద్వారా కాంట్రాక్టు కార్మికులుగా చేరిన యూనిట్ రేట్‌లో పనిచేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు, కన్వెయన్స్ డ్రైవర్లు, నర్సరీ కార్మికులు ఫ్రీ మెడికల్ సౌకర్యం కల్పిస్తూ డైరెక్టర్(పా) బలరాం బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సుమారు నాలుగువేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు ఉపయోగం కలగనుంది. పీఎంఈ, ఐఎంఈ చేయించుకునే ప్రతి కాంట్రాక్ట్ వర్కర్ రూ.2,500 చెల్లించాల్సిన అవసరం లేదు. కొత్తగా సంస్థలో చేరే కాంట్రాక్టు కార్మికులకు ఐఎంఈ, పనిచేస్తున్న వారికి ప్రతి ఐదేళ్లకోసారి, 50ఏళ్లు దాటిన వారికి ప్రతి మూడేళ్లకోసారి పీఎంఈ చేయాల్సి ఉంటుంది. అయితే కాంట్రాక్టు కార్మికుల వేతనాలు దృష్టిలో పెట్టుకుని సర్క్యులర్ రిలీజ్ చేసిన డైరెక్టర్ (పా) బలరాంనాయక్, జీఎం (పర్సనల్) బి.హనుమంతరావుకు కాంట్రాక్టు కార్మికుల సంఘం (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి మధు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సారెస్పీ కాలువలో జారిపడి యువకుడి మృతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని శాంతినగర్‌లో నివాసముండే సంచారజాతికి చెందిన మేకల ఎల్లయ్య (28) ఎస్సారెస్పీ కాలువలో జారిపడి మృతిచెందాడు. బసంత్‌నగర్ ఎస్సై వెంకటేశ్ వివరాల ప్రకారం.. మంగళవారం సాయంత్రం ఎల్లయ్య మండలంలోని అప్పన్నపేట వద్ద గల ఎస్సారెస్పీ కాలువ వద్ద బట్టలు ఉతికేందుకని కాలువలోకి దిగి జారిపడడంతో గల్లంతయ్యాడు. బుధవారం గాలింపు చేపట్టి మృతదేహాన్ని వెలికితీసినట్లు ఎస్సై పేర్కొన్నారు.